సాక్షి ఒడిశా

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,76,717
వెండి	26 గ్రాముల 200 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



పూరీలో 5టీ కార్యదర్శిపై సిరా దాడి

రెండు రోజుల పూరీ పర్యటనలో హడావుడిగా ఉన్న రాష్ట్ర 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్‌కు శనివారం చేదు అనుభవం ఎదురైంది.

- 8లో



రాష్ట్రంలో బ్యూరోక్రాటిక్ పాలన వ్యతిరేకించాలి

రాష్ట్రంలో బ్యూరోక్రాట్లు ఎక్కువ అధికారాన్ని కలిగి ఉన్నారని బీజేడీ ఎమ్మెల్యే సౌమ్య రంజన్ పట్నాయక్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

- 8లో

ఎవర్‌గ్రీన్ హాబీ

- విత్తనాల సేకరణలో హర్షితపై ప్రశంసల జల్లు

ఆదర్శం

జయపురం: ప్రాచీన దేశీయ వరి విత్తనాలు, చోడి విత్తనాలు సేకరిస్తూ ఏడో తరగతి విద్యార్థి హర్షిత ప్రియదర్శిని ప్రశంసలు అందుకుంటోంది. జయపురం ప్రకాశ విద్యాలయంలో చదువుతున్న హర్షితను తాజాగా రాష్ట్ర వ్యవసాయ విభాగ కార్యదర్శి డాక్టర్ అరవింద పాఢి అభినందిస్తూ ప్రశంసా పత్రం అందించారు. విద్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కొరాపుట్ ఆత్మ విభాగ డైరెక్టర్ తాపస కుమార్ రాయ్ ఆ పత్రాన్ని విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ సుకుమార్ పైకటి, అనూరాధ సామల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చిన్న వయసులో ఇలా విత్తనాలు సేకరించడం ప్రశంసనీయమని అరవింద పాఢి ప్రశంసా పత్రంలో పేర్కొన్నారు. ఈ విద్యార్థిని అరుదైన కలాజీర, ఉమిరియ చుడి, తులసీ భోగ, రాధావల్లభ తదితర 150 రకాల దేశీ వరి విత్తనాలు సేకరించింది. వాటిని రైతులకు కూడా అందజేసింది. ఈ బాలిక కృషి అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. తాను కొరాపుట్ వచ్చినప్పుడు కచ్చితంగా ఆ విత్తనాలు, సేకరణ అంశాలపై విద్యార్థినితో చర్చిస్తానని తెలిపారు. దేశీ వరి వంగడాల సేకరణ, సంరక్షణలో ప్రపంచ ఖ్యాతి గడించిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కమలా పూజారి ప్రేరణతో గత 8 నెలల నుంచి దేశీ వరి, రాగి(చోళ్లు) ఇతర చిరుధాన్యాల విత్తనాలు సేకరిస్తున్నానని, ఇంతవరకు 150 రకాల దేశీ ధాన్యం, 50 రకాల దేశీ చోడి విత్తనాలు 7 రకాల దేశీ చిరుధాన్యాలు సేకరించి భద్రపరిచానని విద్యార్థిని వెల్లడించింది.



ప్రశంసా పత్రం అందుకుంటున్న విద్యార్థిని హర్షిత

ఆపదలో.. ఆశాకిరణం

ఇక్కడ భర్త సాయంతో నదిని దాటుతున్న మహిళ పేరు సంజిత నాయక్. రాయగడ జిల్లా కాశీపూర్ సమితి కొడిపారి పంచాయతీలోని జో గ్రామంలో ఈమె ఆశ కార్యకర్తగా పనిచేస్తుంటారు. నదికి ఆవల ఎవరికి ఏ ఆపద వచ్చినా నేనున్నాంటూ ఇలా ప్రత్యక్షమవుతారు. ఇక్కడ ప్రసవాలన్నీ ఆమె పర్యవేక్షణలోనే జరుగుతుంటాయి. నది ప్రవాహం అడ్డుగా ఉన్నప్పుడు ఇలా భర్త సాయంతో నదిని దాటుకుని వెళ్లి మరీ సేవలు అందిస్తుంటారు. తాజాగా నదిని దాటి వచ్చి గ్రామస్తులకు వైద్యం అందించి వారి అభినందనలు అందుకున్నారు. ' - రాయగడ



భర్త సాయంతో నదిని దాటుతున్న ఆశ కార్యకర్త సంజిత నాయక్

న్యూస్‌రీల్

డీఎఫ్‌వోగా ప్రతాప్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



కొత్త డీఎఫ్‌వో ప్రతాప్ కుమార్ బెహర

జయపురం: కొరాపుట్ జిల్లా జయపురం డివిజినల్ ఫారెస్ట్ అధికారి(డీఎఫ్‌వో)గా ప్రతాప్ కుమార్ బెహర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఆరు రేంజ్‌లకు చెందిన అధికారులు సిబ్బంది డీఎఫ్‌వోకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఇప్పటి వరకు అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న మల్కన్‌గిరి డీఎఫ్‌వో కొట్టుపల్లి ప్రతాప్ నుంచి బెహర బాధ్యతలు స్వీకరించారు.

పద్మపూర్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషనర్ పర్యటన



మిర్చిగుడలో పర్యటిస్తున్న కమిషనర్ సాహు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్‌లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వెనుకబడిన తరగతుల కమిషనర్ రూప రోషన్ సాహు శనివారం పర్యటించారు. సమితిలోని మిర్చిగుడ గ్రామంలో ఉన్న సవర లిపి బ్రహ్మ మంగాయ్ గొమాంగొ మందిరాన్ని సందర్శించిన ఆమెకు పలు వినతులు వచ్చాయి. అనంతరం సవర తెగకు చెందిన ఆదివాసీలు ఉండే గ్రామాల్లో పర్యటించి సవర డవలప్‌మెంట్ ఏజెన్సీ సంస్థ అధికారులతో సమావేశమయ్యారు. ఆయనతో పాటు గుణుపూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి శాంతి ప్రభా ప్రధాన్ తదితరులు ఉన్నారు.

నిందితులు అరెస్టు





చోరీకి గురైన ప్లాస్టిక్ డ్రమ్ములు (ఇన్‌సెట్లో) అరెస్టైన సింధు సాగరియ

జయపురం: స్థానిక గగణాపూర్‌లోని సేవా పేపరు మిల్లులో 8 ప్లాస్టిక్ డ్రమ్ములు దొంగతనానికి గురైన ఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర్ తండి శనివారం తెలియజేశారు. ఈనెల 16వ తేదీ రాత్రి పేపరు మిల్లులోని క్యాంటిన్‌లో డ్రమ్ములు దొంగిలించబడ్డాయి. దీనిపై క్యాంటిన్ నిర్వాహకులు సదర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు నిర్వహించి బొడొకావిడి గ్రామానికి చెందిన సింధు సాగరియాను అరెస్టు చేశారు. దొంగిలించబడిన ప్లాస్టిక్ డ్రమ్ములను సీజ్ చేసినట్లు వెల్లడించారు.

మావోయిస్టుల డంప్ స్వాధీనం



గాలింపు బృందం స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల డంప్

భువనేశ్వర్: ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని దట్టమైన అటవీ ప్రాంతంలో మావోయిస్టుల డంప్‌ను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నువాపడా జిల్లా సినపాలి పోలీసు ఠాణా పరిధిలోని పట్టాదర్హ అటవీ ప్రాంతంలో మావోయిస్టుల శిబిరం నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ (ఎస్ఓజీ), డీవీఎఫ్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా దళాలు సంయుక్తంగా శుక్రవారం సాయంత్రం కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ ఆపరేషన్‌లో గాలింపు బృందం 28 డిటోనేటర్లు, ఏకే 47, పేలుడు పదార్థాలు, రేడియో, బ్యాటరీ, మావోయిస్టు యూనిఫాంతోపాటు పలు వస్తువులను స్వాధీనం చేసుకుంది. ఆ ప్రాంతంలో ఇంకా సోదాలు కొనసాగిస్తున్నట్లు నువాపడా జిల్లా పోలీసులు తెలిపారు.

ఆక్యుపెన్సీ ఉంటే చాలు
సేవలు విస్తరిస్తాం

- కార్గో సేవలు వినియోగించుకోండి
- ఏపీఎస్ ఆర్టీసీ విశాఖపట్నం రీజనల్ మేనేజర్ అప్పారావు



విశాఖ పట్నం ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పారావు

కొరాపుట్: ప్రయాణికుల డిమాండ్‌ను బట్టీ (ఆక్యుపెన్సీ)ఒడిశాలో ఏపీఎస్ఆర్టీసీ సేవలు విస్తరిస్తామని ఏపీఎస్ఆర్టీసీ విశాఖపట్నం రీజనల్ మేనేజర్ అంధవరపు అప్పారావు తెలిపారు. శనివారం విశాఖపట్నం నుండి ఒడిశాకు 7 ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు ప్రారంభించిన సందర్భంగా ఆయన కొరాపుట్ విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల ఏపీఎస్ఆర్టీసీకి ఒడిశా ప్రభుత్వంతో నూతన ఒప్పందం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఓఎస్ఆర్టీసీ, ఏపీఎస్ఆర్టీసీ రెండు రాష్ట్రాల్లో బస్సు సర్వీసులు పెంచుకోవడానికి కొన్ని అడ్డంకులు తొలగాయన్నారు. అదే విధంగా ఆర్టీసీ బస్సులో కార్గో సదుపాయం ఉందని వివరించారు. ఈ సర్వీసును ఏజెన్సీల రూపంలో ప్రధాన పట్టణాల్లో ప్రవేటు వ్యక్తులకు ఇస్తామని చెప్పారు. ఈ సరుకు రవాణా సదుపాయాన్ని దేశంలో ఏపీఎస్ఆర్టీసీ రాకపోకలు సాగించే ఎక్కడికైనా వినియోగించుకోవచ్చని తెలిపారు. ఒడిశాలో ఈ సేవలు కావాలనుకునే వారు తమకు అందుబాటులో ఉన్న ఏపీఎస్ఆర్టీసీ బస్సు కండక్టర్, డ్రైవర్లను సంప్రదిస్తే పూర్తి వివరాలు వెల్లడిస్తారని చెప్పారు. ప్రస్తుతం విశాఖపట్నం నుండి నవరంగ్‌పూర్‌కి 3 ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయన్నారు. ప్రయాణికులు లేక ఇంద్రావతికి బస్సు నిలిపి వేసామన్నారు.

డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ జేకేరావు మృతి



రౌర్కెల మున్సిపల్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్స్‌పాల్ జేకే రావు

కొరాపుట్: డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్స్‌పాల్ జామి కామేశ్వర(జేకే రావు)రావు (69) శనివారం రౌర్కెలా నగరంలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. కొరాపుట్ జిల్లా నారాయణ పట్నకి చెందిన జామి బాలకృష్ణ కుమారుడు కామేశ్వర రావు. ఎం.కాం ఎల్ఎల్ బీ చదివారు. రౌర్కెలా మున్సిపల్ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్‌గా పదవీ విరమణ చేశారు. కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. జేకే రావు మృతిపట్ల రౌర్కెల మాజీ ఎంపీ దిలీప్ రాయ్ సంతాపం ప్రకటించారు.

దంపతులపై దాడి.. బంగారం చోరీ



బాధితులు అప్పారావు, పద్మావతి

రాయగడ: వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తున్న దంపతులపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి మహిళ మెడలోని పుస్తెల తాడు, మరో బంగారు చైన్‌ను దోచుకున్నారు. ఈ ఘటన రైల్వే కాలనీలో శుక్రవారం నాడు జరిగింది. బాధితులు అదే రోజు రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. స్థానిక రైతుల కాలనీ ఏడో లైన్‌లో నివాసం ఉంటున్న టి.అప్పారావు, అతని భార్య పద్మావతి శుక్రవారం మధ్యాహ్నం తమ బంధువుల వివాహ కార్యక్రమం కోసం రైల్వే కాలనీలోని అభినందన్ కళ్యాణమండపానికి వెళ్లారు. కార్యక్రమం అనంతరం బైక్‌పై దంపతులిద్దరూ తిరిగి వెళుతున్న క్రమంలో రైల్వే కాలనీలో గుర్తు తెలియని దుండగులు వెనుక నుండి వచ్చి దాడి చేసి పద్మావతి మెడలోని 7 తులాల పుస్తెల తాడు, మరో బంగారు చైన్‌ను తెంపుకెళ్లారు. ఈ పెనుగులాటలో పద్మావతి బైకు నుండి కిందకి పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మొక్కలు నాటుదాం–అడవులు పెంచుదాం



మొక్కలు నాటుతున్న జయపురం కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ సంఘమిత్ర పట్నాయిక్

జయపురం: జయపురం సమితి కెవిటి పంచాయతీ కుంభారిపుట్ గ్రామంలో శనివారం పంచవటి ట్రీ గ్రోవర్స్–కో ఆపరేటివ్ సొసైటీ వారు మొక్కలు నాటారు. సొసైటీ అధ్యక్షుడు బిరేన్ మోహన్ పట్నాయిక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జయపురం కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ సంఘమిత్ర పట్నాయిక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాలో అడవులు తగ్గిపోయాయని, దీని వల్ల పర్యావరణ క్షీణిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో అడవులు పెంచాల్సిన అవసరం ఉందని, అందుకు మొక్కలు నాటే కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొరాపుట్ పంచవటి ట్రీ గ్రోవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ వారు ఆ గ్రామంలో ప్రతి ఒక్కరికీ మొక్కలు పంచి వాటిని వారిచేత నాటించారు. కార్యక్రమంలో కొరాపుట్ పంచవటి ట్రీ గ్రోవర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి ప్రతాప్ మదళ సభ్యులు, సురేంద్ర పాత్రో, నవీన నాయిక్, బాలాజీ మదళ, నీరజ నాయిక్, బుటి హరిజన్, కైళాశ బిశాయి, ప్రతీశ పట్నాయిక్, బిశు ముదులి, సదన హరిజన్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పర్లాకిమిడి ఎమ్మెల్యే



హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ఒడిశా ఎమ్మెల్యే కె.నారాయణరావును స్వాగతిస్తున్న తెలంగాణ బీజేపీ నాయకులు

పర్లాకిమిడి: తెలంగాణ రాష్ట్రంతో పాటు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ.. పార్టీ అబ్జర్వర్లుగా బీజేపీ 560 మంది ఎమ్మెల్యేలను ఎంపిక చేసింది. వీరిలో ఒడిశా నుండి పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావుకు తెలంగాణాలో ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించారు. ఆ నియోజకవర్గంలో కోడూరు నారాయణ రావు పదిరోజుల పాటు అధ్యయనం చేసి బీజేపీ అధిష్టానానికి నివేదిక పంపనున్నారు.

మళ్లీ సొంత గూటికి

- కాంగ్రెస్‌లో చేరనున్న మాజీ సీఎం గిరిధర్ గొమాంగొ కుటుంబం



తిరిగి కాంగ్రెసు గూటికి చేరనున్నట్లు ప్రకటిస్తున్న గిరిధర్ గొమాంగొతో కుమారుడు శిశిర్ గొమాంగో

భువనేశ్వర్: మాజీ సీఎం గిరిధర్ గొమాంగొ తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెలాఖరులోగా కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉంది. ఇంతకు ముందు ఆయన హైదరాబాద్‌లో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో చేరారు. ఈ పార్టీలో చేరిన ఆరు నెలల స్వల్ప వ్యవధికే ఫిరాయించి కాంగ్రెసు గూటికి చేరడం చర్చనీయాంశమైంది. ఆయన భార్య హేమాబతి, కుమారుడు శిశిర్‌లతో కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో శిశిర్ మాట్లాడుతూ ఇటీవల న్యూఢిల్లీలో ఒడిశా కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టరు ఎ.చెల్లకుమార్‌ను కలిశారు. గిరిధర్ గొమాంగొ కుటుంబ సభ్యులను తిరిగి కాంగ్రెస్‌లోకి చేర్చే విషయమై ఇప్పటికే ఉన్నత స్థాయి చర్చలు జరిగాయి. కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చేందుకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను కూడా కలిసే అవకాశం ఉందని శిశిర్ తెలిపారు. పార్టీలో పలు సానుకూల పరిణామాలను దృష్టిలో ఉంచుకుని శిశిర్ కుటుంబ సభ్యులు తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. రాహుల్ గాంధీ పాదయాత్ర తర్వాత మారిన పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఆదరణ పెరుగుతుందని గొమాంగొ కుటుంబం భావిస్తోంది. అంతా అనుకున్నట్లు జరిగితే కాంగ్రెస్ సీనియర్ నేతల సమక్షంలో ఈ నెలాఖరులోగా ఢిల్లీలో చేరిక కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉందన్నారు. భారతీయ జనతా పార్టీని వీడి ఈ ఏడాది జనవరి 27న తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు సమక్షంలో హైదరాబాద్‌లో గొమాంగొ కుటుంబం బీఆర్ఎస్‌లో చేరిన సంగతి తెలిసిందే. అయితే, ఒడిశాలో ఎన్నికల ప్రణాళికలపై బీఆర్ఎస్ ఇంత వరకు నిర్ణయం తీసుకోకపోవడంతో తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. మరో వైపు బీఆర్ఎస్ రాష్ట్రంలో సభ్యత్వ సేకరణ, నమోదు కార్యక్రమం త్వరలో ప్రారంభించనున్నట్లు సమాచారం. రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. కేంద్ర మాజీ మంత్రి, గిరిధర్ గొమాంగొ చివరిసారిగా 2014 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో కొరాపుట్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి బీజేడీకి చెందిన జినా హికాకా చేతిలో ఓడిపోయారు. 1972 నుంచి 2004 సంవత్సరాల మధ్య జరిగిన ఎన్నికల్లో తిరుగు లేని నాయకునిగా విజయం సాధించి తొమ్మిది సార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే. 2015 సంవత్సరంలో కాంగ్రెస్‌ను వీడి తన కుమారుడితో కలిసి బీజేపీలో చేరారు. గిరిధర్ గొమాంగొ, కుమారుడు శిశిర్ గొమాంగొ ఇద్దరూ జనవరి 25న బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి రెండు రోజుల తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ మమత గౌడొ
- సజావుగా కౌన్సిల్ సమావేశం



మున్సిపల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: గుణుపూర్ పట్టణ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ మమత గౌడొ అన్నారు. స్థానిక మున్సిపల్ సమావేశం మందిరంలో కౌన్సిల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కౌన్సిలర్లు వార్డుల్లోని సమస్యలు తెలియజేయాలని కోరారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటే అభివృద్ధి దిశగా పయనించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్యాలయం నిర్మాణానికి తీర్మానం

గుణుపూర్‌లో టౌన్‌హాల్ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో మున్సిపల్ కార్యాలయం నిర్మాణానికి ఆమె ప్రతిపాదించారు. ప్రస్తుతం ఉన్నటువంటి కార్యాలయ భవనం అత్యంత పురాతనమైనది కావడంతో సరైన సౌకర్యాలు లేవన్నారు. సిబ్బంది, ఉద్యోగులు విధి నిర్వహణలో ఇబ్బందులు పడుతున్నారని తెలయజేశారు. అందువలన ఈ ఏడాది కొత్త కార్యాలయ భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. దీనికి సభ్యులంతా ఏకీభవించారు.

డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదన

పర్యావరణ పరిరక్షణ చర్యల్లో భాగంగా గుణుపూర్ ప్రజలకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు కౌన్సిల్‌లో మరో ప్రతిపాదనకు ఆమోదం లభించింది. అభివృద్ధి దిశలో పయనిస్తున్న పట్టణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయగలిగితే పరిశుభ్రంగా ఉంటుందని కౌన్సిలర్లు ప్రతిపాదించారు. ఈ మేరకు చర్చలు జరిగిన అనంతరం డ్రైనేజీ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదించింది. దీనికి త్వరలో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఛైర్మన్ గౌడొ ఆదేశించారు. అదేవిధంగా ప్రజల సౌకర్యార్థం ఖతేశ్వర మందిరం సమీపంలో శ్మశాన వాటిక, పార్వతీనగర్‌లో స్మార్ట్‌పార్క్ ఏర్పాటుకు కౌన్సిల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. త్వరలో ఈ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే గత ఆర్థిక సంవత్సరంలో గుణుపూర్‌లో అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.33 కోట్లు వెచ్చించామని తెలియజేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ శివప్రసాద్ గౌడొ, కార్యనిర్వాహక అధికారి డాక్టర్ సత్యసంపూర్ణ రవుత్ తదితరులు పాల్గొన్నారు.

'ఇన్‌క్రెడిబుల్' సేవ

పర్లాకిమిడి: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా బి.సీతాపురం సమీపంలో ఉన్న ఆశ్రా వయోవృద్ధుల ఆశ్రమంలో ఇన్‌క్రెడిబుల్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ సంఘం శనివారం వేడుక నిర్వహించింది. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు, టవల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణంలోని ఫొటోగ్రాఫర్లు వి.ఢిల్లీ, డి.అమర్, ఆర్.గిరి, పి.శ్యామ్, ఎం.జగదీష్, ఎ.గంగాధర్, సి.హెచ్.ప్రశాంత్, ఎం.సురేష్ కుమార్, రెడ్డి, యస్.శివ, గిరి తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రా వృద్ధాశ్రమంలో పండ్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఫొటోగ్రాఫర్స్ సంఘం

నాట్యమయూరాలు...



జయపురం: ఇటీవల తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య పోటీల్లో జయపురం చిన్నారులు ప్రతిభ చాటారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 15న పెద్ద ఎత్తున జరిగిన ఈ పోటీలకు దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి నృత్యకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో జయపురానికి చెందని సునైన, సుమేధ మిశ్ర, భూమీ హంతాల్, ఎన్.మీనాక్షీలు ప్రతిభ చాటారు. వీరికి నిర్వాహకులు బ్రాంజ్ నంది విగ్రహాలు అందజేశారు. వీరి గురువు వై.గౌరీ శంకర్‌ను ఉత్తమ నాట్య గురువుగా బంగారు నందితో సత్కరించారు. తన శిష్యులు ప్రతిభ చాటడం గర్వంగా ఉందని గురువు గౌరీ శంకర్ తెలిపారు. ఈ నలుగురిలో ఒకరికి అంతర్జాతీయ నృత్య పోటీల్లో పాల్గొనే అవకాశం లభించనున్నట్లు చెప్పారు.

ఎస్పీ రక్తదానం

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని ఆదర్శ డిగ్రీ కాలేజీలో శనివారం ఎస్పీ నితీష్ వాద్వానీ రక్తదానం చేశారు. కాలేజీ అధ్యక్షుడు అలోక్‌కుమార్ పాత్రో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒక యూనిట్ రక్తం ముగ్గురి ప్రాణాలను కాపాడుతుందని ఆయన తెలిపారు. రక్తదానం తప్పకుండా చేయాలని విద్యార్థులకు పిలుపునిస్తూ.. తాను కూడా రక్తదానం చేశారు. శిబిరంలో మొత్తం 36 యూనిట్ల రక్తం సేకరించి రెడ్‌క్రాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బేధవర్ ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్పీ నితీష్

క్లుప్తంగా

1,002 మందికి పింఛన్లు మంజూరు



పెన్షన్ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: జయపురం మునిసిపాలిటీలో మధుబాబు పెన్షన్ పథకంలో 1002 మంది లబ్ధిదారులను చేర్చారు. స్థానిక టౌన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ముఖ్య అతిథిగా హాజరై పింఛన్ లబ్ధిదారులకు మంజూరుపత్రాలను అందజేశారు. 506 మంది వృద్ధులు, 21 మంది దివ్యాంగులు, 88 మంది ఒంటరి మహిళలు, 274 మంది వితంతువులు, 106 మంది ఇతరులకు పెన్షన్‌లు మంజూరు చేసినట్లు మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ వెల్లడించారు. పట్టణంలో కొంతమంది వ్యక్తులు పెన్షన్‌లు చేయిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నయన్నారు. ఎవరైనా డబ్బు వసూలు చేస్తే, ఆ విషయం తనకు, చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లకు తెలియజేయాలన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అర్హులు పెన్షన్ కోసం దరఖాస్తులు చేయాలంటే కౌన్సిలర్లను సంప్రదించాలన్నారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్ర ప్రధాన్, ఉపాధ్యక్షురాలు బి.సునీత, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురి అరెస్టు

గరుగుబిల్లి: ఇంటిగోడలు పగులగొట్టిన సంఘటనలో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు స్థానిక ఎస్సై ఎం.రాజేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు గ్రామంలో ఎస్.సత్యనారాయణ, ఏగిరెడ్డి సింహాచలం నాయుడుల ఇంటి గోడలు, ద్వారబంధాలను అదే గ్రామానికి చెందిన డి.ధనుంజయ నాయుడు తన అనుచరులతో వచ్చి పగులగొట్టినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ధనుంజయనాయుడుతోపాటు ఆయన అనుచరులపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకుని మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపారు.

గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయిని తూకం వేస్తున్న ఎస్సై ఫక్రుద్దీన్

పాచిపెంట: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి 10.3 కేజీల సరుకు శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఫక్రుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన షేక్ ముస్లిం(33), ఇక్బాల్ కబీర్(32)లు ఒడిశాలోని జయపూర్ నుంచి ఒడిస్సా ఆర్టీసీ బస్సులో 10.3 కేజీల గంజాయి సాలూరు తరలిస్తుండగా పి.కోనవలస చెక్ పోస్టు వద్ద పట్టుబడినట్లు చెప్పారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయిని రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో తూకం వేసి, కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

120 లీటర్ల సారా, ద్విచక్ర వాహనం స్వాధీనం

- ప్లాస్టిక్ బొమ్మల చాటున తరలింపు



అదుపులోకి తీసుకున్న ద్విచక్రవాహనం, సారాతో సీఐ ఉపేంద్ర తదితరులు

పార్వతీపురం: ప్లాస్టిక్ ఆటబొమ్మల చాటున సారా తరలిస్తుండగా పోలీసులు నిందితుడిని పట్టుకుని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం గోచెక్క గ్రామ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో ఒడిశా రాష్ట్రంలోని కస్పవలస గ్రామం నుంచి వెదురు బుట్టలో ప్లాస్టిక్ ఆటబొమ్మలతో వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఆపి తనిఖీ చేయగా 120లీటర్ల సారా కేన్లు బయల్పడ్డాయి. ఈ మేరకు వాహనాన్ని సీజ్ చేసి సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఎల్. ఉపేంద్ర తెలిపారు. ఒడిశా రాష్ట్రంలోని విక్రాంపురం గ్రామానికి చెందిన పువ్వల దిలీప్ సాలూరు పట్టణానికి చెందిన గొర్లి పవన్‌కు సారా సరఫరా చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఈ మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై రమణ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెరిగిన ధరలు తగ్గించండి



సబ్‌కలెక్టర్ ఆశిష్ కులకర్ణికి వినతి పత్రాన్ని అందిస్తున్న సీపీఎం నాయకులు



నిత్యావసరాల ధరలు తగ్గించాలని ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

బరంపురం:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలన, నిర్లక్ష్యం కారణంగా రోజు రోజుకీ నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని పెరిగిన ధరలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్ సాహు డిమాండ్ చేశారు. గంజాం జిల్లా సీపీఎం ఆధ్వర్యంలో కోర్టుపేట జంక్షన్‌లో శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ సాహు మాట్లాడుతూ నిత్యవసరాల ధరలు పెరుగుతున్నా అదుపు చేయడంలో బీజేడీ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పెరిగిన ధరల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఈ అంశంపై దృష్టి సారించి పెరిగిన ధరలు తగ్గించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సబ్ కలెక్టర్ ఆశిష్ కులకర్ణికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ నంద తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు, ఈఓలు

పర్లాకిమిడి: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జిల్లాలోని పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, కార్యనిర్వాహణ అధికారులు శనివారం కూడా ఆందోళన కొనసాగించారు. తమ డిమాండ్లు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయని అందువల్ల శుక్రవారం నుంచి సామూహిక సెలవులు పెట్టినట్లు అఖిల ఒడిశా పంచాయతీ కార్యనిర్వాహణ అధికారుల సంఘం అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ రథ్ తెలిపారు. పీఈఓల విద్యార్హత ప్లస్‌టూ నుండి ప్లస్‌త్రీ (పట్టభద్రులు)గా మార్చాలని, ఒడిశా రివైజ్డ్ పేస్కేల్ 2017 ప్రకారం జీతం రూ.21,700 నుంచిరూ.35,400 పెంచాలని, 30 ఏళ్లు సర్వీస్ పూర్తిచేసుకున్నవారికి ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. గుండిచా మందిరం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరకుంటే నిరవధిక సమ్మె చేస్తామని సంఘం కార్యదర్శి సంతోష్ కుమార్ బహదూర్, సంయుక్త కార్యదర్శి రబికుమార్ పాత్రో తెలియజేశారు.

రాష్ట్రంలో బ్యూరోక్రాటిక్ పాలన వ్యతిరేకించాలి

- బీజేడీ ఎమ్మెల్యే సౌమ్య రంజన్ సంచలన వ్యాఖ్యలు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సౌమ్య రంజన్

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు కంటే బ్యూరోక్రాట్లు ఎక్కువ అధికారాన్ని కలిగి ఉన్నారని, దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని బీజేడీ ఎమ్మెల్యే సౌమ్య రంజన్ పట్నాయక్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు అని ధ్వజమెత్తారు. పార్టీ రాజకీయాలపై అధికారుల ఆధిపత్యం క్రమంగా పెచ్చు మీరుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభియోగాలు సేకరించేందుకు 5టీ సెక్రటరీ వీకే పాండియన్ వివిధ జిల్లాల విహంగ పర్యటనలకు రూ.3,00 కోట్లు వెచ్చించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దురదృష్టవశాత్తూ ఒడిశాలో రాజకీయాలను నియంత్రించడానికి బ్యూరోక్రాట్లను అనుమతించడం ద్వారా మంత్రులు తమను తాము తగ్గించుకున్నారని బాహాటంగా వెల్లడించారు.

ఐదుగురు దుండగులు అరెస్ట్





పోలీసులు అరెస్ట్ చేసిన దుండగులు, స్వాధీనం చేసుకున్న బాంబులు ఇతర ఆయుధాలు

- చేపల మార్కెట్‌లో బాంబులు దాడి ఘటన
- బాంబులు, ఆయుధాలు స్వాధీనం

బరంపురం: సంచలనం రేపిన చేపల మార్కెట్‌లో బాంబు దాడి ఘటనకు కారకులైన ఐదుగురు దుండగులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రెండు బాంబులు, కత్తి, ఐరన్ రాడ్ స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. శుక్రవారం ఉదయం పెద్ద బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చేపలమార్కెట్‌లో దుండగులు నాటుబాంబులతో విధ్వంసం సృష్టించి స్థానికులను భయభ్రాంతులకు గురి చేశారు. పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపట్టి ఘటనకు కారకులైన వారిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో లక్ష్మీ నరసింహనగర్‌కి చెందిన సంతోష్ సాహు, బిజయ నాయక్, రోషన్ కుటియా, అమిత్ నాయక్, సత్యబన్ దాస్‌లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

బీజేపీలో చేరిన పలువురు యువత



గౌతమ సామంతరాయ్ సమక్షంలో బీజేపీలో చేరిన యువత

జయపురం: జయపురం బీజేపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మిశ్రణ పర్వ్‌లో పలువురు యువత బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యులు గౌతం సామంతరాయ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీజేడీకి చెందిన పలువురు యువతీ యువకులు బీజేపీలో చేరారు. వారందరినీ సామంతరాయ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పంపుణీ మండలి అధ్యక్షులు దీనబంధు ప్రధాన్ నేతృత్వంలో మధుసూదన్ గౌడ్, హరి హరిజన్, శ్రీరామ హరిజన్, నీలాంబర జాని, మహేశ్వర గౌడ, రాజు గౌడ, గౌరీ ముదులి, పూర్ణ గౌడ, కమళ ముదులితో పాటు పలువురు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ప్రధాని నరేంద్రమోడీ సర్కారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలకు ఆకర్షితులై తాము పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత సామంతరాయ్ మాట్లాడుతూ బీజేపీ ప్రజల పార్టీ అని దేశ ప్రగతికి, పేదల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని వివరించారు. కొరాపుట్ జిల్లాలో ముఖ్యంగా జయపురం విధానసభ నియోజక వర్గంలో పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని అన్నారు. పార్టీ కార్యక్రమాలను క్షేత్ర స్థాయి నుంచే ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపు నిచ్చారు. రానున్న సాధారణ ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు రామ బెహర, నళినీ దాస్, రాధాశ్యామ్ పొరిడ, టుటు హరిజన్, శివ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పూరీలో 5టీ కార్యదర్శిపై సిరా దాడి

- అదుపులో నిందితుడు



సిరా దాడికి గురైన పాండియన్

భువనేశ్వర్: 2 రోజుల పూరీ పర్యటనలో హడావుడిగా ఉన్న రాష్ట్ర 5టీ కార్యదర్శి వి.కె.పాండియన్‌కు శనివారం చేదు అనుభవం ఎదురైంది. పూరీ జిల్లా సత్యబాది యూజీఎస్ కళాశాలలో ఒక కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళ్లిన సందర్భంగా ఆయనపై సిరా విసిరారు. ఆయనతో కార్యక్రమానికి విచ్చేసిన పూరీ జిల్లా కలెక్టర్ సమర్థ్ వర్మపై కూడా పడింది. ఇరువురు బ్యూరోక్రాట్లపై సిరా దాడి చేయడంతో భాస్కర్ సాహు అనే వ్యక్తిని పోలీసులు ఘటనా స్థలంలో అదుపులోకి తీసుకున్నారు. ప్రజాభియోగాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకు 5టీ కార్యదర్శి రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు జరుపుతున్నారు. లోగడ ఈ పర్యటనలో నల్ల జెండాలతో స్థానికులు నిరసన ప్రదర్శించి అడ్డుకున్నారు. ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా యంత్రాంగం చేపట్టిన ముందస్తు చర్యలు శనివారం బెడిసికొట్టాయి. ముఖ్యంగా వచ్చే ఏడాది రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పాండియన్ పర్యటనలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి.

ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలి

పార్వతీపురం: పౌరుల హక్కుల రక్షణ చట్టం, అత్యాచార నిరోధకచట్టం కచ్చితంగా అమలయ్యేలా జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులుగా నియమించనున్నారు. ఈ మేరకు సాలూరు, పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీల్లో సేవాదృక్పథం కలిగిన వ్యక్తుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత అధికారి మహ్మద్ గయాజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 31లోగా జిల్లా ఎస్సీ సంక్షేమం సాధికారత అధికారి, ఆర్‌పీఎం బిల్డింగ్‌నందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాబ్ మేళాలో 31 మందికి ఉద్యోగాలు

విజయనగరం అర్బన్: జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం జరిగిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లా ఉపాధి అధికారిణి డి.అరుణ ఆధ్వర్యంలో జరిగిన మేళాలో విశాఖకు చెందిన 2050 హెల్త్ కేర్ సర్వీసెస్, విజయనగరానికి చెందిన దేవీ ప్రింటర్స్ పాల్గొని నిరుద్యోగులను ఎంపిక చేశాయి. జిల్లావ్యాప్తంగా ఈ మేళాకు 84 మంది హాజరు కాగా 31 మందిని ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియలో 2050 హెల్త్ కేర్ సర్వీసెస్ హెచ్‌ఆర్ రాజీవ్ వర్మ, దేవీ ప్రింటర్స్ సంస్థ యజమాని దేవి, ప్రొఫెసర్ ఎం.యశ్వంత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సేవా శిక్షణ శిబిరం



శిబిరంలో పాల్గొన్న తల్లీబిడ్డలు

జయపురం: స్థానిక గౌడాపాదర్ గ్రామంలో జయపురం చైల్డ్ ఫండ్ ఆధ్వర్యంలో మాతాశిశు ఆరోగ్య సేవా శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా అప్పుడే పుట్టిన బిడ్డలు, బాలింతలు, పెరుగుతున్న శిశువులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మాతాశిశు ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అందిస్తున్న వైద్య సేవలను తెలియజేశారు. కార్యక్రమంలో చైల్డ్‌ఫండ్ ప్రతినిధులు పూర్ణియ దాస్, నీరజ బెణియ, ధార్మిక నాయిక్ పాల్గొన్నారు.

విద్యార్థి మృతి కేసులో లారీ డ్రైవర్ అరెస్టు



లారీ డ్రైవర్‌ను విలేకరుల ముందు ప్రవేశపెట్టిన సీఐ రవికుమార్

రాజాం సిటీ: ఈ నెల 17న జరిగిన స్థానిక శ్రీకాకుళం రోడ్డులో విద్యార్థి మృతికి కారణమైన లారీని పట్టుకుని డ్రైవర్‌ను అరెస్టు చేశామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలు శనివారం ఆయన స్థానిక టౌన్ సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతూ వసతి గృహంలో ఉంటున్న బేరి రవితేజ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అరెస్టు చేయాలని విద్యార్థులు ఆందోళన చేశారు. వారికి ఇచ్చిన హామీ మేరకు సీసీ పుటేజీల ఆధారంగా కొద్ది గంటల్లోనే లారీని గుర్తించి ప్రమాదానికి కారకుడైన ముద్దాడజోగివలస గ్రామానికి చెందిన డ్రైవర్ కె.దుర్గారావును అరెస్టు చేశారు. ఈ విషయాన్ని మృతుని బంధువులు, విద్యార్థులు గమనించాలని సీఐ రవికుమార్ కోరారు. కార్యక్రమంలో ఎస్సైలు వీబీ రామకృష్ణారావు, వై.రవికిరణ్ తదితరులు ఉన్నారు.

గంజాయి అక్రమ రవాణా



గంజాయితో పట్టుబడిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

- ఇద్దరి అరెస్టు

రాయగడ: పట్టణంలో గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు శనివారం పలుచోట్ల దాడులు నిర్వహించారు. స్థానిక రాజ్‌భవన్ లాడ్జి వద్ద అనుమానస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తుల వద్ద బ్యాగులను స్వాధీనం చేసుకుని తనిఖీ చేశారు. అందులో 22.100 కిలోల గంజాయి పట్టుబడింది. పట్టుబడిన వారిని అధికారులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో జిల్లాలోని గుడారి ప్రాంతానికి చెందిన మానస్ రంజన్ లబల, లావణ్య సబరొ ఉన్నట్లు అధికారులు తెలియజేశారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కింద ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మరో 75 మంది వద్ద సరైన పత్రాలు లేకపోవడంతో వారి నుంచి రూ.77,500 అపరాధ రుసుం వసూలు చేసి, కేసులు నమోదు చేసినట్లు జిల్లా పోలీస్ విభాగం అధికారులు వెల్లడించారు. అక్రమంగా తరలిస్తున్న 16.82 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

17 కేజీల గంజాయి పట్టివేత ఇద్దరు అరెస్ట్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి యం వి 11 గ్రామం కూడలి వద్ద శనివారం పోలీసులు ఇద్దరు వ్యక్తుల నుంచి 17 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం వాహనాలను చెక్ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై అతి వేగంగా రావడాన్ని గమనించారు. వారిని ఆపి తనిఖీ చేయగా 17 కేజీల గంజాయిని గుర్తించారు. ఈ కేసులో మల్కన్‌గిరి సమితి నిలిమేరి గ్రామానికి చెందిన నరేంద్ర హంతాళ్, తర్లకొట్ట గ్రామవాసి నందుఖీలోను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ 1.7లక్షలు అని పోలీసులు తెలిపారు.



గంజాయితో పట్టుబడిన నిందితులు

పొదుపు మహిళలు జీవనోపాధి పెంచుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి

విజయనగరం అర్బన్: ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహాలతో పొదుపు మహిళలు జీవనోపాధి పెంచుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ చక్రవర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో శనివారం మండల సమాఖ్య పాలకవర్గ సభ్యుల సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. తొలుత గడిచిన నెలలో సాధించిన ప్రగతిని మండలాల వారీగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోని పొదుపు సంఘాల ప్రగతిని, సంఘాలలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలను పాలకవర్గ సభ్యులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ప్రతి సభ్యురాలు జీవనోపాధి పెంచుకుని ఆర్థిక పరిపుష్టి మెరుగుపరుచుకోవాలని ఆకాంక్షించారు. యూనిట్లు స్థాపించి ఆదాయం పెంచుకోవాలని అన్ని రెగ్యులర్ జరగాలని తెలియజేశారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో సందర్శించేటప్పుటు క్షేత్రస్థాయిలో జరుగుతున్న, జరిగిన ప్రగతిని స్థాపించిన యూనిట్‌లను చూపించాలని సూచించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కె.వెంకట సత్యవతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీడీ కె.సావిత్రి, సమాఖ్య మేనేజర్ సాయిప్రసాద్, డెంకాడ ఎఫ్‌పీఓ ఏపీఎం విశేశ్వరరావు, మండలాల పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



హాజరైన పాలక వర్గ సమాఖ్య సభ్యులు

క్లుప్తంగా

శుభ కార్యానికి ధర్మానకు ఆహ్వానం



ధర్మానకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును తన కుమారుడి వివాహానికి ఆహ్వానిస్తూ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ఆహ్వాన పత్రికను శనివారం అందజేశారు. పెదపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ధర్మానను కలిశారు. సెప్టెంబర్ 2న విజయవాడలో జరగబోయే తన కుమారుడి వివాహ శుభ కార్యానికి హాజరు కావాలని ఆయన కోరారు.

'విధి నిర్వహణలో సహకరించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వారికి నిర్దేశించిన విధులు సమర్థంగా నిర్వహించాలని, రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ నిర్దేశించిన ఆదేశాలు కూడా పాటించాలని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్ట మల్లేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం తన కార్యాలయంలో పీపీ, ఏపీపీలతో సమావేశం నిర్వహించారు. నెలవారీ సెషన్లు, రివిజన్లు, క్రిమినల్ అప్పీళ్లు, లీగల్ ఒపీనియన్లు, రిజిస్టర్లు మెయింటైన్ చేయాలని పై నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు.

'తప్పుడు నివేదికలు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇచ్ఛాపురం మండలం ఈదుపురం దళితుల ఆస్తుల ధ్వంసం విషయంలో తప్పుడు నివేదికలు ఇచ్చి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నీరుగార్చిన నాటి మండల తహసీల్దార్ ఎస్.గురు ప్రసాద్, ఇతర సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి, సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా కమిటీలు కోరాయి. ఈ మేరకు శనివారం కలెక్టర్ ఎం.నవీన్‌ను కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జేసీని కలిసిన వారిలో వేదిక జిల్లా అధ్యక్షుడు అనపాన షణ్ముఖ రావు, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, బాధిత మహిళ ఎస్తేరు తదితరులు ఉన్నారు.

బ్యాగ్ కాపాడిన '139'



బాధితునికి బ్యాగ్ అందిస్తున్న ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ ప్రసాద్

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బైపల్లి గ్రామానికి చెందిన బి.వెంగళరావు ఈ నెల 15న ఆయన భార్యతో పాటు కలిసి స్వగ్రామం వెళ్లేందుకు ట్రైన్‌లో ప్రయాణం చేశారు. బరంపురం ఇంటర్‌సిటీ ట్రైన్ ఎక్కాల్సి ఉండగా తొందరలో ముందుగా వచ్చిన బెంగళూరు-భువనేశ్వర్ (ప్రశాంతి ఎక్స్‌ప్రెస్)లో దువ్వాడ స్టేషన్‌లో ఎక్కారు. అయితే తమకు రిజర్వేషన్ ఉన్న ట్రైన్‌లో కాకుండా తొందరపాటులో వేరే ట్రైన్ ఎక్కామని గమనించిన వారు తమ వద్ద ఉన్న విలువైన బ్యాగ్‌ను ట్రైన్‌లో మరిచిపోయి అదే స్టేషన్‌లో దిగిపోయారు. అయితే కొద్ది సమయానికి బ్యాగ్ విషయం గుర్తుకురావడంతో ఏం చేయాలో తెలియక లబోదిబోమన్నారు. స్థానికంగా ఉన్న ఆర్‌పీఎఫ్ పోలీసులను సంప్రదించి విషయం చెప్పడంతో వారు 139 నంబర్‌కు ఫిర్యాదు అందించాలని సూచించారు. దీంతో బాధితులు అందించిన ఫిర్యాదు మేరకు ఆర్‌పీఎఫ్ పోలీసులు స్పందించి బ్యాగ్‌ను కనిపెట్టి శ్రీకాకుళంలో అదే రోజు బాధితులకు అందించారు. దీంతో బాధితులు ఆర్‌పీఎఫ్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓటర్ల జాబితా పరిశీలన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఓటర్ల జాబితాలో ఉన్న తొలగింపులను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పరిశీలించారు. నరసన్నపేట, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాలకు సంబంధించి శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ల జాబితా తొలగింపులకు సంబంధించి పత్రాలు సక్రమంగా ఉన్నదీ లేనిదీ ఫిజికల్ డాక్యుమెంట్లను ఆయన పరిశీలించారు.

జీడి మద్దతు ధర పెంచాలని వినతి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జీడి పంటకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరను పెంచాలని జిల్లా మత్స్యకార సంఘ నాయకులు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను ఆయన చాంబర్‌లో సోమవారం కలిసి వినతి పత్రంను అందజేశారు. జిల్లాలో తీరం వెంబడి సుమారుగా 197 కిలోమీటర్లు పొడవునా మత్స్యకార గ్రామాల్లో జీడి పంటలు వేస్తున్నారని, మద్దతు ధర లేకపోవడంతో నష్టపోతున్నారని వివరించారు. ఈ ఏడాది కేంద్రం జీడి మద్దతు ధరను రూ.14 వేలుగా నిర్ణయించిందని, అయితే ఈ రేటును పెంచాలని కనీసం క్వింటాకు రూ.16 వేలు చేయాలని వారు కోరారు.

మేలుకుందోమ



తురకపేట సెంటర్‌లో వ్యర్థాలతో నిండిపోతున్న అసర్లవాని చెరువు

- నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం
- పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నిర్మూలన
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం

ఎల్‌ఎన్ పేట: మలేరియా, డెంగీ, చికున్‌గున్యా.. వ్యాధి పేరేదైనా కారణం మాత్రం చిన్న దోమ. మనుషుల చిన్నపాటి నిర్లక్ష్యాన్ని ఆయుధంగా చేసుకుని, వారి అలసత్వాన్ని ఆసరాగా మలచుకుని, వారి బద్ధకాన్నే ఆవాసాలుగా మలుచుని దోమలు విజృంభిస్తున్నాయి. ఇది వాటి కాలం. చినుకులు మొదలైంది మొదలు దోమల బెడద పెరుగుతుంది. నేడు ప్రపంచ దోమల నివారణ దినోత్సవం. ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే దోమలను నియంత్రించాలని, నియంత్రణ జరగాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు సూచిస్తున్నారు. 1897 ఆగస్టు 20న దోమల నివారణ దినోత్సవాన్ని ప్రకటించారు. దోమల నుంచి మలేరియా వ్యాపిస్తోందని సర్ రోనాల్డ్ రాస్ కనుగొనడంతో అప్పటి నుంచి ఏటా ఈ దినోత్సవం నిర్వహిస్తున్నారు. వాస్తవానికి దోమల జీవిత కాలం 15 రోజులే. కానీ ఇవి వైరస్‌ల వాహకాలుగా ఉంటూ నిండు ప్రాణాలను సైతం తీసేయగలవు.

పరిసరాలు జాగ్రత్త..



ఇల్లు, వాకిలి, ఇంటిలో మూలలు అన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. పాత సామానులు దాచే ఇరుకు సందులు, స్టోర్ రూంలు, రెస్ట్ రూమ్‌లు, కంప్యూటర్ మూలలు, పేపర్లు దాచిపెట్టే అలమరాలు, వాహనాలు, మీ ఇంటి చుట్టూ ఉంటే పిచ్చి మొక్కలు, మీరు తినేసి బయటకు విసిరేసే వ్యర్థాలు ఇవన్నీ దోమలకు ఆవాసాలుగా మారే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా డ్రైనేజీలు, నీటి కొళాయిలు, బోర్లు, బావులు చుట్టూ ఉన్న మురికి ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలి.

ఇలా చేస్తే మేలు..

- మీ ఇళ్లలోకి గాలి, వెలుతురు బాగా తగిలేలా చూసుకోండి. మీ ఇంట్లో అన్ని మూలల్లోను, మంచాలు, బీరువాల కింద చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, మురికి నీటి గుంటలు లేకుండా చూసుకోవాలి.
- మీరు టీవీ, కంప్యూటర్, వాషింగ్ మెషీన్, ఫ్రిజ్, ఏసీ వంటివి కొనేటప్పుడు వచ్చే ప్యాకింగ్ డొక్కులు ఇంట్లో ఉంచకండి.
- వారంలో ఒకటి రెండు రోజులు ఇంట్లో అన్ని గదుల్లోను వేపాకులతో కలిపిన గుగ్గిలం ధూపం వేయాలి.
- మీ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోండి. పిచ్చి మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించండి. కొళాయిలు, బోర్లు, బావులు వద్ద మురికి నీరు నిల్వ లేకుండా చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ వేయిస్తూ ఉండండి.
- ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.

దోమలతోనే అనేక వ్యాధులు



దోమలు కుట్టడం వల్ల అనేక వ్యాధులు ప్రబలుతున్నాయి. వ్యాధి ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది. మలేరియా, టైఫాయిడ్, ఫైలేరియా, డెంగీ వంటి ఎన్నో వ్యాధులకు దోమలే కారణం. రసాయనాలతో కూడిన అనేక రకాల లిక్విడ్‌లు, క్వాయిల్స్ వంటివి మార్కెట్లో లభిస్తున్నాయి. వీటిని ఉపయోగించడం వల్ల మరికొన్ని జబ్బులు ప్రబలే ప్రమాదం లేకపోలేదు. ముందుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమల నివారణకు వైద్య శాఖ ద్వారా పలు అనేక చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డీఎంహెచ్‌ఓ, శ్రీకాకుళం

ఉత్తమ శాస్త్రవేత్తగా బాలకృష్ణ ఎంపిక



అవార్డు అందుకుంటున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ

ఆమదాలవలస: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో పనిచేస్తున్న మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ బాలకృష్ణ ఆక్వా కల్చర్ విభాగంలో ఉత్తమ శాస్త్రవేత్తగా ఎంపికై అవార్డు అందుకున్నారు. గుంటూరు ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలకు, విస్తరణ అధికారులకు, సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న రైతులకు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలకు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను రాష్ట్రస్థాయిలో అవార్డులు అందించారని ఆయన తెలిపారు.

ఇందులో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ డాక్టర్ బాలకృష్ణ సేవలు, పరిశోధన పత్రాలను పరిశీలించి రాష్ట్రస్థాయిలో ఉత్తమ శాస్త్రవేత్తగా ఎంపిక చేశారు. ఈ అవార్డును కేఎల్ యూనివర్సిటీలో జరిగిన కిసాన్ సమ్మేళనంలో ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి చేతుల మీదుగా బాలకృష్ణ అందుకున్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ రైతుగా నాగరాజు

కాశీబుగ్గ: కాశీబుగ్గకు చెందిన పి.నాగరాజు వినూత్న రీతిలో వరి పండించినందుకు రాష్ట్రస్థాయి ఉత్తమ రైతు అవార్డు దక్కింది. ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిసాన్ మహోత్సవం-2023 కార్యక్రమం గుంటూరు వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ యూనివర్సిటీలో జరిగింది. రాష్ట్ర స్థాయి అధికారులు, నాయకులు సమక్షంలో నాగరాజుకు అవార్డు అందించి సత్కరించారు.



ఉత్తమ రైతు అవార్డు అందుకుంటున్న నాగరాజు

ఫొటోగ్రఫీ అవార్డు అందుకున్న జయశంకర్



అవార్డు అందుకుంటున్న జయశంకర్

శ్రీకాకుళం కల్చరల్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శనివారం విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీకాకుళం 'సాక్షి' ఫొటోగ్రాఫర్ కుప్పిలి జయశంకర్ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఢిల్లీ రావు, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

ఉత్తరాంధ్ర బీసీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా రౌతు శంకరావు



రౌతు శంకరావు

శ్రీకాకుళం రూరల్: ఉత్తరాంధ్ర బీసీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా రౌతు శంకరావు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమలయ్యేలా చూడాలని ఆయన పేర్కొన్నారు.

పాఠశాలలో వినియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పాఠశాలల్లో వియోగదారుల క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తెలిపారు. దీనిపై ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. వినియోగదారుల చట్టంపై అందరికీ అవగాహన కలిగి ఉండాలని జేసీ తెలిపారు. పాఠశాల స్థాయిలో పిల్లలకు వినియోగదారుల చట్టంపై అవగాహన పెంచేందుకు ఈ క్లబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. చట్టం విశిష్టత, అవసరాలను విద్యార్థులకు వివరించాలని సూచించారు. వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు న్యాయవాది బగాది రామ్మోహనరావు మాట్లాడుతూ వినియోగదారుల చట్టం పై ప్రజల్లో మరింత అవగాహన పెంచాలన్నారు. వినియోగదారులు నష్టపోయినా లేదా మోసపోయినా తర్వాత తీసుకోవాల్సిన విషయాలపై వివరించారు. జిల్లాలో 106 క్లబ్‌లు ఏర్పాటు చేయగా, పాఠశాలల్లో 100 క్లబ్‌లు, డిగ్రీ కళాశాలల్లో 6 క్లబ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్ వెంకటాచలం వినియోగదారుల హక్కులు, చట్టాలపై మాట్లాడుతూ ఏదైనా నష్టపోయినా లేదా మోసపోయినా సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. వినియోగదారుల హక్కులు చట్టాలు, తదితర వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ వెంకటరమణ, తూనికలు కొలతలు శాఖ జిల్లా అధికారి విశ్వేశ్వరరావు, మాస్టర్ ట్రైనర్స్ ఎల్.వెంకటచలం, బి. శ్రీనివాసరావు, ఏఎస్‌ఓ జె. రవి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గోపాల్, డీటీ ఈశ్వర సాయి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ ఎనిమిదో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కళాశాల ఎనిమిదో సెమిస్టర్ (చివరి సెమిస్టర్) ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు శనివారం విడుదల చేశా రు. సీఎస్‌ఈలో 64కి 60 మంది, ఈసీఈలో 62కి 61, మెకానికల్ ఇంజినీరింగ్‌లో 65కి 65 మంది ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 15 రోజుల్లోగా చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతాడ రాజశేఖర్‌రావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ ఎనిమిదో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేస్తున్న వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్‌ఓ సర్టిఫికెట్



ఐఎస్‌ఓ సర్టిఫికెట్‌ను చూపుతున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ, అధ్యాపకులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రఖ్యాత ఐఎస్‌ఓ సంస్థ ధ్రువీకరణ పత్రం అందజేసింది. ఈ మేరకు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ వివరాలు వెల్లడించారు. కళాశాలలో మౌలిక సదుపాయాలు, పచ్చదనం, ఉత్తీర్ణత, శక్తి వినియోగం, తదితర అంశాలను గుర్తింపునిస్తూ ఐఎస్‌ఓ సంస్థ మూడు రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోవిందమ్మ మాట్లాడుతూ.. కళాశాలలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులంతా సమష్టిగా పనిచేయడంతో ఈ గుర్తింపు వచ్చిందన్నారు. అనంతరం సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్ కుమార్, ఎ.రామారావుతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాము కాటుతో రైతు కూలీ మృతి



మృతి చెందిన సింహాచలం(ఫైల్)

నరసన్నపేట: మండలం నడగాం పంచాయతీ జగన్నాథపురానికి చెందిన రైతు కూలీ డోల సింహాచలం (55) పాము కాటుకు గురై మృతి చెందారు. వ్యవసాయ పనుల్లో భాగంగా పొలం పని చేస్తున్నప్పుడు గురువారం పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు నరసన్నపేట ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందు తూ శనివారం మృతి చెందారు. ఈ మేరకు భార్య లక్ష్మి నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతునికి భార్య ల క్ష్మితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

22న ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ నెల 22న జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయన బీఆర్‌ఏయూలో నిర్వహించే సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొంటారని, అలాగే ఈ కార్యక్రమానికి పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు తదితరులు హాజరు కానున్నారని తెలిపారు.

కామెంటేటర్‌గా సిక్కోలు వాసి శ్రీవర్ధన్



బి.శ్రీవర్ధన్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఏపీఎల్ సీజన్-2 సీజన్‌కు కామెంటేటర్‌గా జిల్లాకు చెందిన బొడ్డేపల్లి శ్రీవర్ధన్ వ్యవహరిస్తున్నారు. తనకు ఏసీఏ కామెంటేటర్‌గా అవకాశం కల్పించడంపై శ్రీవర్ధన్ సంతోషం వ్యక్తం చేశా రు. ఈ పోటీలు విశాఖపట్నంలోని వీసీఏ-వీడీసీఏ డాక్టర్ వైఎస్ఆర్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో హోరాహోరిగా జరుగుతున్నాయి.

175 సీట్లు గెలవడం ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: రానున్న ఎన్నికల్లో 175 సీట్లకు 175 గెలిపించి వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు అడుగులు వేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. స్థానిక శారద కల్యాణ మండపంలో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి సచివాలయం, జేసీఎస్ కన్వీనర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ నియమించిన సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు సంయుక్తంగా పనిచేసి వార్డుల వారీగా ప్రజానీకంతో మమేకం కావాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని వారికి వివరించాలన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష కార్యక్రమాలు గ్రామస్థాయిలో విజయవంతం కావడంలో సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ల పాత్ర కీలకంగా నిలిచిందన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దాదాపు 35 ప్రభుత్వ శాఖలకు సంబంధించి 500 సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గం పార్టీ ప్రత్యేక పరిశీలకులు ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ పింఛన్ కావాలన్నా, రేషన్ కార్డు కావాలన్నా, ఇంటి పట్టాలు కావాలన్నా, తాగునీటి సరఫరా సమస్య ఉన్నా వెంటనే పరిష్కరిస్తున్నారని తెలిపారు. సచివాలయంలో అర్జీ పెట్టుకున్న 72 గంటల్లోనే సమస్య పరిష్కారం అవుతోందన్నారు. ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే ఈ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓ దురుసు ప్రవర్తనపై విచారణ



విచారణ చేపడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనురాధ

సారవకోట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న పద్మావతిపై ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుపై అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఎస్.అనురాధ శనివారం విచారణ చేపట్టారు. సీహెచ్‌ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందిపై దురుసుగా ప్రవర్తిస్తుంటారని, ఇష్టానుసారంగా అరుస్తుంటారని ఇటీవల సిబ్బంది మూకుమ్మడిగా డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై అడిషనల్ డీఎంహెచ్‌ఓ విచారణ చేపట్టగా.. సిబ్బంది తమ అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. కొన్ని నెలల కిందట ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కూడా సిబ్బంది అంతా సీహెచ్‌ఓ ప్రవర్తనపై ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు దృష్టికి తీసుకొచ్చారు. అప్పట్లో ఆయన సిబ్బందికి నచ్చజెప్పారు. అయినప్పటికీ సీహెచ్‌ఓ తీరులో మార్పు రాకపోవడంతో సిబ్బంది అంతా ఏకమై డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అడిషనల్ డీఎంహెచ్‌ఓ పూర్తిస్థాయి నివేదికను డీఎంహెచ్‌ఓకు అందజేయనున్నట్లు తెలిపారు. ఆమెతో పాటు పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్, వైద్యులు దేవిక, సౌమ్యలు ఉన్నారు.

పులి సంచారంపై అప్రమత్తం



గిరిజనులను అప్రమత్తం చేస్తున్న ఫారెస్టు అధికారులు

కొత్తూరు: మండలంలోని లబ్బ, కారిగూడ, ఈతమానుగూడ, బాంద్రగూడతో పాటు పలు గిరిజన గ్రామాలకు ఆనుకొని ఉన్న తివ్వకొండల్లో పులి సంచరిస్తున్నట్లు ఫారెస్టు అధికారులు నిర్ధారించారు. దీంతో గిరిజనులు అప్రమత్తంగా ఉండాలని సారవకోట ఫారెస్టు అధికారి ఈశ్వరరావు అన్నారు. రాత్రిళ్లు పొలాలు, కొండల్లోకి వెళ్లవద్దని సూచించారు. పశువులను కొండ మీదకు మేతకు తీసుకెళ్లవద్దని చెప్పారు.

జనావాసంలో ఎలుగు సంచారం



కొత్తపేట జంక్షన్‌లో సంచరిస్తున్న ఎలుగు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తపేట-కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి ఎలుగు సంచరించినట్లు షిర్డీసాయి గుడికి అమర్చిన సీసీ కెమెరాల్లో కనిపించింది. టిఫిన్ సెంటర్ల బయట పారబోసిన ఆహార పదార్థాలను తింటూ భల్లూకం కాసేపు గడిపింది. ఆ సమయంలో ఎవరూ రోడ్డుపై లేరు. దీంతో ఆ ప్రాంతంలోని వీధి కుక్కలు పెద్దగా అరుస్తూ ఎలుగును తరిమేందుకు ప్రయత్నించాయి. కుక్కల అరుపులతో కొందరు నిద్రలేచి ఎలుగును భయపెట్టి అక్కడ నుంచి తరిమివేశారు. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. ఫారెస్టు అధికారులకు విషయం తెలియజేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాద స్థలంలో పోలీసులు, రమణ మృతదేహం

రణస్థలం: మండలంలోని వల్లభరావుపేట గ్రామానికి చెందిన దువ్వాన రమణ(32) శనివారం రోడ్డు ప్రమాదంలో మరణించారు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. వల్లభరావుపేట గ్రామానికి చెందిన దువ్వాన రమణ, జేఆర్ పురం రామతీర్థాలు రోడ్డులో కార్పెంటర్‌గా పనిచేస్తున్న కె.శ్రీనుతో కలిసి బైక్‌పై వస్తున్నారు. మండల కేంద్రంలోని పాత పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై మలుపు తిరిగేందుకు రోడ్డు పక్కన నెమ్మదిగా వచ్చి బైక్ నిలబెట్టారు. సాయంత్రం 5.30 సమయంలో వెనుక నుంచి వచ్చిన ఐసర్ వ్యాన్ వీరి బండిని ఢీకొట్టి ఈడ్చుకు వెళ్లిపోయింది. దీంతో దువ్వాన రమణ అక్కడికక్కడే మృతిచెందగా, శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించడంతో అతడిని రణస్థలం సామాజిక ఆస్పత్రికి తరలించారు. హైవేపై వేగ నియంత్రణకు పోలీసులు జిగ్ జాగ్ టైపులో డ్రమ్ములు పెట్టారు. వేగంగా వస్తున్న ఐసర్ వ్యాన్ డ్రైవర్ ఒక వైపు మలుపు తిప్పి రెండో వైపు మలుపు తిప్పకుండా రోడ్డు పక్కన ద్విచక్రవాహనంపై ఉన్న ఇద్దరిని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. మృతుడు రమణ రోజువారీ కూలి పనులు చేస్తుంటాడు. ఆయనకు భార్య దువ్వాన భారతి, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు

జగనన్న కాలనీలో కలెక్టర్ పర్యటన



చల్లవానిపేటలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

జలుమూరు: మండలంలోని చల్లవానిపేటలోని జగనన్న కాలనీని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ శనివారం పరిశీలించారు. కాలనీలో తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర సదుపాయాలన్నీ కల్పించాలని సూచించారు. కాలనీలో తాగునీరు సక్రమంగా పంపిణీ జరుగుతోందా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అరకొర నీరు వస్తుందని చెప్పడంతో పూర్తిస్థాయిలో తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లకు సంబంధించి ముందుగా గ్రావెల్ రోడ్డు ఈ నెల 21 నాటికి పూర్తి చేయాలని, తర్వాత కాలనీ లోపల వీధుల్లోని రోడ్లన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 30 నాటికి కాలనీని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నారు. వెంకటాపురంలో ఎస్సీ కాలనీ సమస్య పరిష్కరించాలని ఆ కాలనీ వాసులు కలెక్టర్ వద్ద మొర పెట్టుకున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ప్రభుత్వ భూమిగా తేలితే బోర్డులు పెట్టాలని తహసీల్దార్ సత్యంను కలెక్టర్ ఆదేశించారు. ఇదే విషయం ఆర్డీఓ పరిశీలనలో ఉందని తహసీల్దార్ చెప్పగా అవసరమైతే 144 సెక్షన్ పెట్టి అక్కడకు ఎవరినీ వెళ్లనీయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జోనంకిలో వార్డు ఎన్నికల పోలింగ్ పరిశీలించారు. ఆయనతోపాటు గృహనిర్మాణ శాఖ పీడీ నక్క సత్యనారాయణ, ఈఈ కె.అప్పారావు, డీఈఈ రామూర్తి, ఏఈ శంకరరావు, గ్రామీణ నీటిసరఫరా విభాగం డీఈఈ జల్లు సుదర్శన్, ఏఈ ఆర్.చైతన్య ఉన్నారు.